క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని వినాయకుడి దేవాలయం వద్ద శనివారం 22 మంది అనాథలకు ఉపాధ్యాయులు దుప్పట్లు పంపిణీ చేశారు. 12 సంవత్సరాల సర్వీసు పూర్తయిన సందర్భంగా దుప్పట్లు అందజేసినట్లు 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు కుల్లాయప్ప, నాగరాజు, చంద్ర, వెంకట్, నరేష్ గౌడ్, నరసింహులు, శీన, రఫీ, మల్లికార్జున, లింగమాచారి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

నల్లమాడ: మండలంలోని యర్రవంకపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మీసాల రమణప్ప (50) అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు జయరామిరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసుల యాదవ్, నాయకులు రాజారెడ్డి, బాలిరెడ్డి, జయమ్మ, ఆనంద్, రామునాయక్, లక్ష్మానాయక్, సూర్యనారాయణ తదితరులు రమణప్ప మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయం

తనకల్లు: పాఠశాల విద్య ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి చేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ టీఎఫ్ నాయకులు పుల్లయ్య, నాగవేణి, సిద్దారెడ్డి, బయ్యపురెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యాశాఖలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సాధించిన వ్యక్తి ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. అలాంటి వ్యక్తిపై దాడి చేయడం పిరికిపంద చర్య అని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు వీరనారాయణ స్వామి పరుష

బత్తలపల్లి: మండలంలోని రామాపురం, మాల్యవంతం గ్రామాల్లో వీరనారాయణ స్వామి పరుషను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం వీరనారాయణస్వామి గ్రామోత్సవం అనంతరం సమీపంలోని చిత్రావతి నదిలోకి తీసుకెళ్తారు. అక్కడ పూజలందుకున్న అనంతరం భక్తులకు భవిష్యవాణిని వినిపిస్తారు. ఈ వాణిని వినేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటారు. ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

బత్తలపల్లి: మండల పరిధిలోని వేల్పుమడుగు క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మవరం పట్టణం బురుజువీధికి చెందిన అల్లం రామశేషయ్య అనంతపురం పట్టణంలోని సాయిగణేష్ అపార్ట్‌మెంట్ ప్రక్కన మొదటి క్రాస్ మారుతినగర్‌లో నివాసముంటున్నాడు. శుక్రవారం వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంలో ధర్మవరంకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం మండల పరిధిలోని వేల్పుమడుగు క్రాస్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయాలతో రోడ్డు పక్కన పడి ఉన్న రామశేషయ్యను అటుగా వెలుతున్న నిరంజన్‌యాదవ్ గుర్తుంచి వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం అటు నుంచి బెంగళూరుకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంతాప సభ

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద శనివారం ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు సంతాప సభను ఆ యూనియన్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైవీ రావు ఎంప్లాయీస్ యూనియన్, అమరావతి జేఏసీకీ ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. కార్మిక సంక్షేమానికి ఆయన చేసిన కృషి మరువలేదన్నారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు నాగార్జునరెడ్డి, జీవైపీ రావు, ఆర్ఎస్ రెడ్డి, దివాకర్, శంకరప్ప, గంగాధర్, ఇమాం పాల్గొన్నారు.

సర్వం.. శివమయం


బత్తలపల్లి: పూజలందుకుంటున్న ఓంకారేశ్వరుడు


ధర్మవరం అర్బన్: అలంకరణలో శివకేశవస్వామి


పుట్టపర్తి టౌన్: శివుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

- ఘనంగా జాగరణ
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

ఓడీ చెరువు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఓడీసీ శివాలయంలో పురోహితులు మురళీ స్వామి, వంచిరెడ్డిపల్లి హరిహర నందీశ్వరాలయంలో పురోహితులు రంగనాథశర్మ శివుడికి అభిషేకాలు చేశారు.

నీలకంఠేశ్వరుడికి క్షీరాభిషేకం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని నీలకంఠేశ్వరస్వామికి భక్తులతో క్షీరాభిషేకం చేయించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామికి పూజలు చేశారు.

నల్లమాడ: నల్లమాడ, రాగానిపల్లిలోని శివాలయాల్లో శివపార్వతులకు పూజలు నిర్వహించారు. అలాగే వంకరకుంట సమీపంలోని భవనాశినీ ఆశ్రమం, దేవరగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, పెద్దకోట్లపల్లి ఆంజనేయస్వామి, గోపేపల్లిలోని గీతా మందిరంలో భక్తుల సందడి నెలకొంది.

విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు..

ధర్మవరం అర్బన్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలన్నీ విద్యుత్ దీపాలంకరణలో కళకళలాడుతున్నాయి. శివానగర్ బచ్చునాగంపల్లి కాశీవిశ్వనాథస్వామి ఆలయం, గాంధీనగర్ సహస్ర సిద్ధరామలింగేశ్వరస్వామి ఆలయం, గీతానగర్ శివాలయంలో ప్రత్యేక పూలతో స్వాములను అలంకరించారు.

కదిరి టౌన్: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని ఖాద్రీ ఆలయం, శివాలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

తిమ్మమ్మమర్రిమానుకు పోటెత్తిన భక్తులు

ఎన్‌పీకుంట: శివరాత్రి జాగరణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం తిమ్మమ్మమర్రిమాను ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు పట్టుకుని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మర్రిమాను ప్రాంతంలో తిమ్మమ్మకోట, శివప్రాజెక్టు భక్తులతో సందడిగా మారింది. వచ్చిన భక్తుల కోసం దిగువగూటిబైలు గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, మదనపల్లికి చెందిన రామ్మోహన్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జాగరణలో భాగంగా శనివారం రాత్రి టూరిజం గైడ్ ఎద్దుల మనోహర్ ఆధ్వర్యంలో తిమ్మమాంబ, బాలవీరయ్య జీవిత చరిత్రను బుర్రకథ రూపంలో ప్రదర్శించారు. శివరాత్రి జాగరణలో భాగంగా ధనియానిచెరువు భైరవేశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకులు శనివారం రాత్రి ఆర్కెస్ట్రా కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అన్నదానం..

తనకల్లు: స్థానిక శివాలయంతో పాటు కనసానివారిపల్లి వద్ద వెలసిన భైరాగిస్వామి గుడి, కొక్కంటి క్రాస్‌లో ఉన్న జంబులింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

కొత్తచెరువు: కొత్తచెరువులోని సంగమేశ్వర, సోమేశ్వర, మరువ ఆంజనేయ స్వామి దేవాలయాల్లోని శివాలయాల్లో స్వామికి ఉదయం అభిషేకాలు నిర్వహించారు. సంగమేశ్వర దేవాలయంలో అడిషనల్ ఎస్పీ వెంకటరామకృష్ణ ప్రసాద్ పాల్గొని పరమేశ్వరుడికి అభిషేకం చేయించారు. దేవాలయాల్లో రాత్రి భక్తి గేయాలు, భజనలు, ఉపవాసాలతో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తలుపుల: మండలంలోని శివాలయాలు, అక్కదేవతల ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మండల కేంద్రంలోని ఓబీఆర్ రోడ్డులోని శివాలయం, ఓదులపల్లి గ్రామం సమీపంలోని శివాలయం, నామాల గుండు సిద్దిలింగేశ్వరాలయం, పులిగుండ్లపల్లి గ్రామం సమీపంలోని అక్కదేవతల, తలుపులకు సమీపంలోని నందీశ్వరుని మూల అక్కదేవతల ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది.

అలరించిన నాటక ప్రదర్శనలు..

బత్తలపల్లి: సంఘమేశ్వర క్షేత్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పంచరత్నాలు నాటకాన్ని ప్రదర్శించారు. బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ ఓంకారేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో దశరత్నాలు నాటకాన్ని ప్రదర్శించారు.

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం, చిల్లవారిపల్లి గ్రామంలోని శివాలయం, తాడిమర్రి, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆయా ఆలయాల పూజారులు స్వామి మూలవిరాట్‌లకు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించారు. భక్తులు రాత్రి నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ భజన చేశారు.

కనగానపల్లి: మండలంలోని కనగానపల్లి, తగరకుంట, ముక్తాపురం, పర్వతదేవరపల్లి శివాలయాల వద్ద తెల్లవారుజామున నుంచే భక్తులు శివలింగాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అతకల్లపట్నం మల్లేశ్వర ఆలయంలో జరిగిన పూజలు, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతిగ్రామం వద్ద వెలసిన శివలింగ మందిరానికి భక్తులు పోటెత్తారు. ఆవరణలోని కుంభ కర్ణ విగ్రహ ఆవిష్కరణ, ధ్యాన మందిరాన్ని డీఆర్‌ఓ కొండయ్య, ఎస్‌బి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, కౌన్సిలర్ సాయిగీత, లక్ష్మీ అక్క, గోపి తదితరులు ప్రారంభించారు.


తాడిమర్రి: కాటికోటేశ్వర క్షేత్రంలో భక్తుల సందడి


తలుపుల: నామాలగుండు వద్ద సిద్దిలింగేశ్వరాలయంలో..


ఓడీ చెరువు: వంచిరెడ్డిపల్లి నందీశ్వరాలయంలో స్వామికి అభిషేకం


ఖాద్రీశుడి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


పుట్టపర్తిఅర్బన్: ప్రశాంతి గ్రాంలో ఏర్పాటు చేసిన శివలింగం

యలవ గంపకు ప్రత్యేక పూజలు


యలవ గంపలను తీసుకెళ్తున్న దృశ్యం

తాడిమర్రి: బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామం నుంచి పాదయాత్రగా శనివారం తాడిమర్రి చేరిన యలవ గంపలకు (వీరనారాయణ స్వామి పూజా సామగ్రి) భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నార్పల మండలం నల్లపరెడ్డిపల్లి గ్రామంలో వీరనారాయణస్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయానికి శివరాత్రి పర్వదినాన పాముదుర్తి నుంచి యలవ గంపలు రావడం ఆనవాయితీ. పాముదుర్తిలో స్వామి భక్తులు ఒక కొత్త చేట, గంపలను పవిత్ర గంగలో(బావి నీటిలో) ఉంచి ప్రత్యేక పూజలు చేసి నల్లపరెడ్డిపల్లి వీరనారాయణస్వామి పూజారులకు అందజేస్తారు. గంపలను వారు నెత్తిమీద ఎత్తుకుని ఉరుముల వాయిద్యాలతో కాలినడకన వస్తుండటంతో గ్రామాల్లో భక్తులు పూజలు చేసి పార్లు దండాలు చేశారు.

కోఆప్షన్ సభ్యుడి మృతి బాధాకరం


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: కో-ఆప్షన్ సభ్యుడు ముస్తఫా అలియాస్ బాబు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. శనివారం స్థానిక బూడిదగడ్డ వీధిలో ముస్తఫా మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముస్తఫా వైఎస్సార్‌సీపీలో చాలా చురుగ్గా పని చేశారన్నారు. కో-ఆప్షన్ సభ్యుడిగా మంచి సేవలు అందించినట్లు కొనియాడారు. అతడు అనారోగ్యంతో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రామ్‌దేశాయ్, నాయకులు బీఎస్ నిజాం, తబ్రేజ్, శ్రీనివాసులు, నరసింహులు, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని కొత్తమిద్ది గ్రామానికి చెందిన శీలం రామలక్ష్మమ్మ (65) గుండెపోటుతో శనివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి నాయకులతో కలిసి గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శీలం వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచులు సామిరెడ్డి, రామకృష్ణ, కలాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలందుకున్న సీతారామలక్ష్మణులు

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవ వేడుకలను శనివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి దేవాలయ ప్రధాన అర్చకుడు కొమాండూరు మారుతి ప్రసాద్ పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ఆకుపూజ నిర్వహించారు. భజనలు, హనుమాన్ చాలీసా పఠించారు. తెల్లవారుజాము వరకూ భజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు రమేష్ ప్రసాద్, సాయికృష్ణ పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

పుట్టపర్తి టౌన్: పట్టణంలో హనుమాన్ దేవాలయంలో ఉన్న శివాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం రాత్రి శివపార్వతులు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య స్వామికి కల్యాణం జరిపించారు. శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న వారికి అష్ట సౌభాగ్యాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొత్తచెరువు: లింగారెడ్డిపల్లి శివాలయం సమీపంలోని పేకాట స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3,750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు.

పరుష ఏర్పాట్ల పరిశీలన

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లి వద్ద జరుగుతున్న వీరనారాయణస్వామి పరుష ఏర్పాట్లను శనివారం సాయంత్రం అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్‌ఐ హేమంత్‌కుమార్‌కు సూచించారు. ప్రజలు కూడా ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని కోరారు.

ఘనంగా ఓపెన్ డే


కళాశాలలోని కోర్సుల వివరాలు, సదుపాయాలను వివరిస్తున్న అధ్యాపకులు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డా.స్మిత ఆధ్వర్యంలో ఓపెన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు డిగ్రీ కళాశాలను సందర్శించారు. డిగ్రీ కళాశాలలో ఉన్న కోర్సుల వివరాలు, సౌకర్యాలు, సదుపాయాలు, వృత్తి నైపుణ్య కోర్సులకు సంబంధించి వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. అలాగే కళాశాలలో నిర్వహిస్తున్న జేకేసీ, స్కిల్‌హబ్‌పై వివరించారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరి ఉజ్వల భవిష్యత్తును సాకారం చేసుకోవాలని అధ్యాపకులు సూచించారు. కార్యక్రమంలో పీడీ నరసింహాచారి, అధ్యాపకులు శ్రీనివాసులు, ఆదినారాయణ, గురుప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు


మాట్లాడుతున్న ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి

ధర్మవరం: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎస్కేయూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో 15వ వార్షికోత్సవ వేడుకలను పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, చేరుకునేంత వరకూ నిరంతరం శ్రమించాలన్నారు. కాలం విలువ తెలుసుకుని ఆ సమయాన్ని వృథా చేయకుండా అందరూ బాగా చదువుకుని మంచి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సురేష్‌కుమార్, పాఠశాల డైరెక్టర్లు రూపరాజా కృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజారెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా కాశీ విశ్వనాథుడి రథోత్సవం


రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు

ధర్మవరం అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని శివానగర్‌లో ఉన్న బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో రథోత్సవం వైభవంగా సాగింది. తొలుత పార్వతీ, పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి నూతన రథంపై కొలువుదీర్చారు. తెల్లవారుజామున 5 గంటలకు పార్వతీ, పరమేశ్వరులకు కల్యాణం జరిపించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జయరామిరెడ్డి, గోవిందరాజులు, గుర్రం రాజా, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మల, వైస్ చైర్మెన్లు ఎర్రగుంట్ల భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.